క్లుప్తంగా

వాహనాల తనిఖీ



తల్లాడ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న వైరా సీఐ సాగర్

తల్లాడ: కల్లూరు రోడ్‌లోని తల్లాడ చెక్‌పోస్టు వద్ద శనివారం వైరా సీఐ సాగర్ వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లో ఉన్నందున తల్లాడ వద్ద ఎన్నికల చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు పత్రాలు కలిగి ఉండాలని, ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలన్నారు. అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వావానాల తనిఖీలో వైరా ఎస్సై వంశీకృష్ణ బాగ్యరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల సంరక్షణ ముఖ్యం



మాట్లాడుతున్న సత్తుపల్లి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్

సత్తుపల్లిరూరల్: మానవుల మనుగడకు పశువుల సంరక్షణ ముఖ్యమని సత్తుపల్లి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వరల్డ్ వెటర్నరీ డే సందర్భం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనిషికి కావాల్సిన సహజసిద్ధమైన పౌష్టికాహారం పశువుల ద్వారా ఏ పద్ధతుల్లో లభిస్తుందో వివరించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. బీఎస్సీ డైరీ సైన్స్ కోర్సును ప్రారంభించి.. విద్యార్థులకు వెటర్నరీ డిపార్ట్‌మెంట్‌లో గల అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, అధ్యాపకులు ప్రభావతి, రామచంద్ర రావు, వీరన్న, రాంబాబు శ్రీధర్ పాల్గొన్నారు.

గీతా మందిరం నూతన కమిటీ ఎన్నిక



బాధ్యతలు చేపట్టిన నూతన కార్యవర్గం

సత్తుపల్లి: పట్టణంలోని శ్రీగీతాజ్ఞాన మందిరం ట్రస్ట్ చైర్మన్‌గా కొత్తూరు రాజేశ్వరరావు, కార్యదర్శిగా బాల లీలాకృష్ణారావు, కోశాధికారిగా గుడివాడ చక్రధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గుడివాడ వీరరాఘవ వెంకటేశ్వరరావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, గౌరవ సలహాదారులుగా తిరునగరి వెంకటనర్సయ్య, కొత్తూరు సత్యనారాయణ, సహకోశాధికారిగా కొనకళ్ల శంకర్‌రావు నియమితులయ్యారు. అదే విధంగా అన్నదాన కమిటీ అధ్యక్షుడిగా ఏపూరి పురుషోత్తం, రతికంటి సత్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు, గుడిమెట్ల రామకృష్ణ, వనమా నరేష్, గుండు శ్రీనివాసరావు నియమితులయ్యారు.

వైద్య శిబిరం విజయవంతం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

బోనకల్: మండలంలోని రావినూతల, ముష్టికుంట్ల, కలకోట, ఆళ్లపాడు, పెద్దబీరవల్లి, చిరునోముల గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలు విజయవంతమెయ్యాయి. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు వడదెబ్బ లక్షణాలు, నివారణా చర్యలు, వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వైద్యాధికారి స్రవంతి, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, డాక్టర్ ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్ దానయ్య, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కొణిజర్లలో బియ్యం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

కొణిజర్ల: కొణిజర్లలో ఇటీవల మృతి చెందిన నాయీబ్రాహ్మణ యువకుడు వేముల రవితేజది నిరుపేద కుటుంబం కావడంతో కొణిజర్ల మండల నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు శనివారం కర్మ సందర్భంగా క్వింటా బియ్యం, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు, గుడివాడ వెంకటేశ్వర్లు(బోంబే), కొలిపాక వీరబాబు, వెంకన్న, నారాయణ, పుల్లారావు, నరేష్ పాల్గొన్నారు.



తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న గీత కార్మికుడు

సండే స్పెషల్

‘కల్లు’కు భలే గిరాకీ!

- వేసవిలో సహజ సిద్ధమైన పానియానికి ఆదరణ
- ఆసక్తి కనబరుస్తున్న కల్లుప్రియులు
- కల్లు, తాటిముంజలు, డేగుల అమ్మకాలతో ఉపాధి
- కల్లుగీత కార్మికులకు ఏడాదంత పనే

కల్లూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో తాటిచెట్లు ఉండగా.. కల్లుగీత కార్మికులు అధికంగా కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. చుట్టూ తాటిచెట్లు ఉండడంతో ఏడాదంతా కల్లు గీసుకొని జీవనం సాగిస్తుంటారు.

అలాగే తాటి ముంజలు, డేగులపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. తాటి చెట్లలో రెండు రకాలు ఉంటాయి. అవి ఒకటి పరుపు తాడు, పోతుతాళ్లు. తాళ్లకి కాసిన ముంజలను గీత కార్మికులు విక్రయాలు కొనసాగిస్తుంటారు.

పెరిగిన డిమాండ్...

సహజసిద్ధమైన పానీయం తాటికల్లుకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ప్రతి ఏడాది వేసవికాలంలోనే తాటిచెట్టు నుంచి కల్లు ఉత్పత్తి అవుతుంది. సీజనల్‌గా దొరికే తాటికల్లుకు గ్రామాల్లోనే కాక పట్టణ ప్రాంతాల్లో కూడా మంచి డిమాండ్ ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు.. అలాగే సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తాటికల్లు విక్రయాలు జరుగుతుంటాయి. ఈ సమయాల్లో ప్రజలు తాటికల్లును ఎక్కువగా సేవిస్తుంటారు. వేసవి బీర్లు ఇతర మత్తు పానియాలు ఉన్నప్పటికీ తాటికల్లుకు డిమాండ్ ఎప్పటికీ ఉంటుంది. ఈ మేరకు కల్లుప్రియులతో పాటుగా ప్రయాణాలు కొనసాగిస్తున్న వాహనదారులు రోడ్డు పక్కన ఉన్న పాకల వద్దకు వెళ్లి కల్లు సేవిస్తుంటారు. సాధారణ, పేద ప్రజలకు వేసవిలో కల్లు తాగటం తప్పనిసరి దినచర్యగా మారుతుంది.



రహదారి వెంట కల్లు సేవిస్తున్న ప్రయాణికులు

తాటికల్లు సేవనం వల్ల లాభాలు..

- వేసవిలో తాటికల్లు సేవించటం వల్ల ఆరోగ్య పరంగా మంచి ఫలితాలు ఉంటాయని అనాదిగా వస్తున్న ఒక నమ్మకం.
- తాటికల్లులో కిడ్నీలను శుభ్రపరిచే గుణం ఉంటుంది.
- తాటి ముంజలు దాహార్తిని తీర్చడమే కాకుండా శరీర వేడిని తగ్గిస్తాయి.
- బరువు ఉండేవారు 8 నుంచి 10 ముంజలు తింటే ఫలితం ఉంటుంది.
- మధుమేహ, మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు కూడా ముంజలు మేలు చేస్తాయి. కానీ అతిగా తినొద్దని వైద్యులు సూచన.
- సీజనల్‌గా దొరికే ముంజలను మోతాదులో తినడం మంచిది.

కనుమరుగవుతున్న తాటిచెట్లు..

తాటి చెట్ల పెంపకం చేపట్టేందుకు రైతులెవ్వరు ముందుకు రావడం లేదు. దీంతో రానురాను తాటి చెట్లు అంతరించిపోయే అవకాశం ఉందని భావిస్తున్నారు. గతంలో ఉన్న తాటిచెట్లను విచ్చలవిడిగా నరికి వేశారు. ఇప్పటికీ కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి, చిన్నకోరుకొండి, కల్లూరు, చంద్రుపట్ల, రఘునాధగూడెం, రఘునాధ బంజరు, కొర్లగూడెంలోకవరం, తాళ్లూరు, వెంకటాపురం, ముచ్చవరం తదితర గ్రామాల్లో తాటిచెట్లు విరివిగా ఉన్నాయి. గతంలో వరంగల్, నల్గొండ జిల్లాల నుంచి కల్లుగీత కార్మికులు కల్లూరుకు వచ్చి కల్లు విక్రయాలు సాగించేవారు. ఈ ప్రాంతంలో కల్లు ఉత్పత్తి తగ్గటం వల్ల ఇతర జిల్లాల నుంచి కల్లుగీత కార్మికులు రావడం లేదు. స్థానిక కల్లు గీత కార్మికులే విక్రయాలు సాగిస్తున్నారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామ

ఏన్కూరు: పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని తిమ్మారావుపేటలో శనివారం రాత్రి బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు రోడ్డు షో నిర్వహించిన ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండోసారి ఆశ్వీరదించి పార్లమెంట్‌కు పంపిస్తే తెలంగాణ ప్రయోజనాలు కాపాడడంతో పాటు పార్లమెంట్ సాక్షిగా ప్రజా సమస్యలపై గళం విప్పి ప్రశ్నిస్తానన్నారు. జిల్లా ప్రజల గౌరవవాన్ని దేశస్థాయిలో పెంచడమే ధ్యేయంగా రానున్న ఐదేళ్లు పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్‌మదన్‌లాల్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

‘నామ’ను గెలిపించాలి..

ఎర్రుపాలెం: బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కోరారు. శనివారం మండలంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి హాజరైయ్యారు. అనంతరం నిర్వహించిన మండలస్థాయి బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణా అమరవీరుల ఆత్మశాంతించాలని మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం మండలకేంద్రంలోని ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి దేవరకొండ ప్రభాకర్ దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి నివాళి అర్పించారు. మృతుని సోదరుడు దేవరకొండ రవి, కుటుంబసభ్యులకు సంతాపం తెలిపి సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ శీలం కవిత, ఎంపీటీసీలు రామకోటేశ్వరరావు, మల్లిఖార్జున్ రెడ్డి, కిశోర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్‌ను గెలిపించండి



మాట్లాడుతున్న మట్టా దయానంద్

కల్లూరురూరల్: కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ అన్నారు. శనివారం మండలంలోని ఎర్రబోయినపల్లిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రమసహాయం రఘురాంరెడ్డి గెలుపుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ రావాలని, అందుకు అందరి సహకారం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్వేశ్వరరావు, పోట్రు సత్యం, బత్తుల రాము, ఏనుగు సత్యబాబు, భాగం ప్రభాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కనుమరుగవుతుంది..

బోనకల్: పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ కనుమరుగవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పీసీసీ మెంబర్ పైడిపల్లి కిషోర్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6 గ్యారెంటీల్లో 5 అమలు చేశామని, ఎలక్షన్ తరువాత ఆ ఒక్క గ్యారెంటీని కూడా అమలు చేసి తీరుతాం అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, నాయకులు కోటి, గుగులోత్ రమేష్, చిలుకా వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, శాస్త్రి, తిరుపతిరావు, భద్రూనాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మధిర: ఎండ తీవ్రత దృష్ట్యా మధిర మెయిన్ రోడ్డు నందు శ్రీరామ టవర్స్ వారి చలివేంద్రం వద్ద మజ్జిగ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లఖండం సత్యనారాయణ మూర్తి, కర్లపాటి ఆదినారాయణ, ఇల్లూరి మురళి, కొప్పురవు బాలకోటేశ్వరరావు, కృష్ణప్రసాద్, విజయా మిల్క్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు బస్టాండ్‌లో..

కల్లూరు: కల్లూరు బస్టాండ్‌లో 60 రోజులపాటు దాతల సహకారంతో ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో శనివారానికి 26వ రోజుకు చేరుకున్న సందర్భంగా బత్తుపల్లి పంచాయతీ కార్యదర్శి ఎ.రాజశేఖర్‌రెడ్డి దాతృత్వంతో ఏర్పాటు చేసిన మజ్జిగను ఎంపీడీఓ పంపిణీ చేశారు. సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. మూడేళ్లుగా చల్లని నీటితో పాటుగా మజ్జిగ పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సురేష్‌బాబు, ఈఓ సీహెచ్ కృష్ణారావు, వీబీఓ కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.



కల్లూరు బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: ఈ నెల 30వ తేదీన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రలో భాగంగా తల్లాడలో నిర్వహించే రోడ్‌షోను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. స్థానిక బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఆయన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులంతా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ కూసంపూడి మహేష్, మట్టా ప్రసాద్, అద్దంకి అనిల్, ఎస్‌కె చాంద్‌పాషా, అమరవరపు కృష్ణారావు, మాధురి మధు, నడ్డి ఆనందరావు, గఫార్‌ఖాన్, నరుకుళ్ల శ్రీను, నర్సింహారావు, ప్రవీణ్, అయూబ్‌పాషా, వల్లభనేని పవన్, రాము, శ్రీను పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం సుభిక్షం



ఉపాధికూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

కారేపల్లి: భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో ప్రధాని మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని ఆపార్టీ జిల్లా నాయకుడు తురక నారాయణ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి వినోదరావు ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రచారంలో భాగంగా శనివారం కారేపల్లి పెద్దచెరువులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోటేశ్వరరావు, సీహెచ్ రామారావు, రాము, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలి



డాక్టర్ లవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆస్పత్రి కార్మికులు

కల్లూరు: మే 1న కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో కార్మికులు.. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అధికారి డాక్టర్ లవన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాలీలు, ప్రదర్శనలు, కార్మిక జెండాను ఆవిష్కరించి కార్మికుల సమస్యలను వివరించాలని, కార్మిక హక్కులను సాధించడం కోసం పోరాడి ప్రపంచ వ్యాప్తంగా అనేక హక్కులను సాధించుకోవడం జరిగిందన్నారు. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని శ్రమ దోపిడీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ, రాంబాబు, దయాకర్, ఆస్పత్రి కార్మికులు పాల్గొన్నారు.

నిత్య విద్యార్థిలా ఉండండి..



మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: న్యాయశాస్త్రంపై అధ్యయనం చేస్తూ జూనియర్ న్యాయవాదులు నిత్య విద్యార్థిలా ఉండాలని 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి కోర్టులో శనివారం ఐదు సంవత్సరాలు నిండని జూనియర్ న్యాయవాదులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోవాలంటే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సివిల్, క్రిమినల్ కేసుల విచారణ ప్రక్రియను వివరించారు. కోర్టులు వాటి పరిధి, పనితీరు, కోర్టులు నడిపే సరళి, పరిభాషపై అవగాహన కల్పించారు. ముందుగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్లూరి ఆదయ్య(ఆడమ్స్)లతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎస్‌కె బుజ్జీసాహెబ్, సీహెచ్ కృష్ణప్రసాద్, కె.ప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ ఎం.రమేష్, ఏపీపీ అబ్దుల్‌భాషా, వంకదారు రామకృష్ణ, మల్లెపూల వెంకటకృష్ణ, వెంకట్రావ్, మహిళా ప్రతినిధి జినాధున్నీషా, మారేష్, విజయ్‌కుమార్, సాంబశివరావు, శిరీష, గుంట్రు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, అరుణ పాల్గొన్నారు.

కేంద్రాల్లో వసతులు కల్పించాలి

బోనకల్: పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించాలని ఆర్డీఓ జి.గణేష్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్‌లెవల్ అధికారులచే ఓటర్ స్లిప్పుల పంపిణీ, ఓటర్ల మొబైల్ నంబర్లు, సీవిజిల్ యాప్ డౌన్లోడ్, టాయ్‌లెట్స్, రన్నింగ్ వాటర్, పోలింగ్ కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్ల ఏర్పాట్లు, 1,000ఓట్లు కంటే ఎక్కువ ఓటర్లు గల పోలింగ్ కేంద్రాల ఎంట్రీ, ఎగ్జిట్ డోర్ల పురోగతిపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు వాల్‌పోస్టర్లు అందజేశారు. అందులో పోలింగ్ కేంద్రాల వివరాలు, బీఎల్వో, సూపర్‌వైజర్, సబ్ ఇన్స్‌పెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారి పేరు, మొబైల్ నంబర్లు ఉన్నాయని, వీటిని పోలింగ్ కేంద్రాల వద్ద అంటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్ సూపర్‌వైజర్లు, ఎంపీడీఓ ఎల్ రాజు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన..

చింతకాని: ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ఖమ్మం ఆర్డీఓ గణేష్ తెలిపారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో ఓటు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించి.. బీఎల్వోలకు తగు సూచనలు చేశారు. ప్రతి ఒక్క ఓటరుకు ఓటు స్లిప్పులను త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, మండల వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య, బీఎల్వోలు పాల్గొన్నారు.



చింతకాని: పందిళ్లపల్లిలో పోల్ చీటి అందిస్తున్న ఆర్డీఓ గణేష్

కొనకళ్ల సుధారాణికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న సుధారాణి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, సనాతన ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ల సుధారాణి తన ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పేదలు, దివ్యాంగులు, కూలీలు, వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను ఉగాది పురస్కారం లభించింది. శనివారం హైదరాబాద్‌లోని భారత వికాస్ పరిషత్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు సూర్యచంద్ర కల్చరల్ ఆర్గనైజేషన్ ఉగాది పురస్కారాన్ని అందజేసింది. ఈ కార్యక్రమానికి మాజీ స్పీకర్ మధుసూదనాచారి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పద్మాచారిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధారాణి చేస్తున్న సేవలను కొనియాడారు. సుధారాణి మాట్లాడుతూ.. తనకు ఈ అవార్డు ఎంతో ప్రత్యేకమని, తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. తన ట్రస్టు తరుపున మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

చింతకాని: మండలంలోని బస్వాపురం గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేసిన సందర్భంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ కంఠమహేశ్వరస్వామి, సురమాంబ తల్లికి జలబిందెలతో పూజలు చేసి బోనాలు సమర్పించారు. అనంతరం గౌడ జెట్టి పూజారి యం.ఆంజయ్య శ్రీ కంఠమహేశ్వర స్వామి, సురమాంబ తల్లి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆదివారం ఆలయంలో మోకు ముస్తాబుల పూజ, వనం యల్లమ్మ తల్లి, వనం మైసమ్మతల్లి పూజలు, మహా మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, షేక్ షాజహాన్, గౌడ కులపెద్దలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న గౌడ కులస్తులు

ఆలయంలో అన్నదానం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో శనివారం అంకమ్మ దేవాలయంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముందుగా అష్టోత్తరనామం, గోత్రనామ పూజలు నిర్వహించారు. కుంకుమ పూజ, వాహన పూజ జరిగింది. ఈ సందర్భంగా గండ దీపముల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ దొడ్డా శ్రీనువాసరావు, చిన్న శ్రీను, తుమ్మలపల్లి వెంకటేశ్వర్‌రావు, సాందీపులు, మారెళ్ల దేవేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలు కళావతి దంపతులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మధిర: మధిర బాలికల ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న ఎస్.కళావతిని పీఆర్‌టీయూ కార్యాలయంలో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ.. కళావతి 38 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఉపాధ్యాయురాలిగా ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థితికి తీసుకెళ్లారని, మొదటి నుంచి పీఆర్‌టీయూ సభ్యురాలిగా కొనసాగుతూ సంఘానికి వెన్నుదన్నుగా నిలిచారని తెలిపారు. శేషజీవితాన్ని సంతోషంగా గడపాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షులు కృష్ణమోహన్, రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వరరావు, మదార్, మాజీ రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వరరావు, జయరాజు, జిల్లా బాధ్యులు బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, కిరణ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇక శుభకార్యాలకు బ్రేక్..

మూడు నెలల పాటు మూఢాలు

సత్తుపల్లిటౌన్: మూఢం వచ్చేసింది.. దీంతో పెళ్లిళ్లు, శుభకార్యాలకు బ్రేక్ పడింది. వరుసగా మూడు నెలల పాటు మూఢాలు ఉండడంతో ఏ శుభకార్యం నిర్వహించే అవకాశం లేదని పండితుల చెబుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 10నుంచి మాఘ మాసం, మార్చి, ఏప్రిల్ నెలల్లో చైత్రమాసంలో మంచి ముహూర్తాలు ఉండడంతో వేల సంఖ్యలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి వరకు శుభకార్యాలతో సందడి నెలకొనగా.. మూఢం రావడంతో అన్నింటికీ బ్రేక్ పడింది. ఈనెల 28 నుంచి జూలై 8వ తేదీ వరకు మూఢాలు, జూలై 8 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆషాఢమాసం ఉండడంతో శుభకార్యాలకు బ్రేక్ పడినట్లయింది. మళ్లీ ఆగస్టు 8నుంచి మంచి ముహూర్తాలు ఉండడంతో శుభకార్యాలకు అనువుగా ఉంటుందని అర్చకులు చెబుతున్నారు. కాగా, మూఢాల సమయంలో గృహప్రవేశాలు, ఆలయ ప్రతిష్టలు, పెళ్లిళ్లు, శంకుస్థాపనలు, చెవిపోగులు కుట్టించడం వంటివి చేయడానికి వీలుండదని సత్తుపల్లికి చెందిన వేదపండితులు రామడుగు గురుప్రసాదాచార్యులు తెలిపారు. అయితే, ఈ సమయాన బారసాల, ఊయలలో వేయడం, అన్నప్రాసన, పుష్పాలంకరణ, పంచె వేడుకలు మాత్రమే జరుపుకోవచ్చని పేర్కొన్నారు. ఈమేరకు మూఢకాలం ముగిసి మంచి ముహూర్తాలు వచ్చేవరకు పురోహితులు, భజంత్రీలు, టెంట్‌హౌస్, క్యాటరింగ్, డెకరేషన్ తదితర రంగాల నిర్వాహకులతో పాటు ఫంక్షన్ హాళ్ల బాధ్యులు వేచిచూడాల్సిందే.